క్లుప్తంగా

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఎంజీ రోడ్డులోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా ఆ సంఘ ప్రతినిధులు ఆవిష్కరింపచేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్, వేముల బేబీరాణి, మహీధర్, అజయ్, మణికంఠ పాల్గొన్నారు.

ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌నకు ఎంపిక



మద్దినేని ఉమామహేష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ ఏడాది అక్టోబర్ 22 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు సౌత్ కొరియాలోని ఛాంగ్‌వాన్ సిటీలో జరుగనున్న ఏషియన్ షూటింగ్ చాంపియన్ షిప్–2023 పోటీలకు విజయవాడ నగరానికి చెందిన మద్దినేని ఉమామహేష్ ఎంపిక అయ్యాడని రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు తొట్టెంపూడి షాలలిత్, కార్యదర్శి డి.రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియా నుంచి 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ జూనియర్ విభాగంలో ఇండివిడ్యువల్, మిక్స్‌డ్, టీమ్ విభాగాల్లో ఎంపికయ్యాడన్నారు. కోచ్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఉమామహేష్‌ను అభినందించారు. ప్రస్తుతం ఉమామహేష్ ఢిల్లీలో శిక్షణ పొందుతున్నాడని, వచ్చే నెల 10 తేదీ సౌత్ కొరియాకు బయలుదేరి వెళతారని చెప్పారు.

44వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం



భవానీపురం(విజయవాడపశ్చిమ): డివిజన్ సమగ్రాభివృద్దే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నామని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని నాలుగు స్తంభాల సెంటర్ లోగల నాగేంద్ర స్వామి కొండపై భాగంలో రూ.17 లక్షల వ్యయంతో ఆర్‌సీఎం చర్చి వరకు రోడ్డు, రిటైనింగ్‌వాల్, సైడు కాలువల నిర్మాణ పనులకు ఆమె కొబ్బరికాయ కొట్టారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ.. డివిజన్ ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు మాట్లాడుతూ డివిజన్ ప్రజల అవసరాలను తెలుసుకుని వాటిని తీర్చడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వీరంకి సత్యనారాయణ, కుంభా జోజి, గుంజ కొండలరావు, కాంట్రాక్టర్ నరెడ్ల రామారావు, స్థానికులు పాల్గొన్నారు.

రెడ్ కార్పెట్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో రెడ్ కార్పెట్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌ను బుధవారం నిర్వాహకులు ఆర్.కె.నాయుడు, శైలజా రామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగర ప్రజల నుంచి ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన వస్తోందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో క్లాతింగ్, జ్యూయలరీ, హోమ్‌డెకార్స్‌కు సంబంధించి 40 స్టాల్స్ ఉన్నాయన్నారు. గురువారం రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిట్స్ నిర్వాహకుడిపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్స్ నగదుతో పాటు చేబదులుగా తీసుకున్న డబ్బులు ఇవ్వడం లేదంటూ ఓ వ్యక్తిపై కొత్తపేట పోలీసులకు బాధితుడు బుధవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహంతిపురం అప్పలస్వామి వీధికి చెందిన సరగడ శ్రీనివాసరావు పెయింటింగ్ కాంట్రాక్టర్‌గా చేస్తుంటాడు. శ్రీనివాసరావు తనకు పరిచయం ఉన్న వనమా సురేష్ వద్ద చిట్స్ వేస్తుంటాడు. 2022 జనవరిలో సురేష్ వద్ద రూ.5 లక్షల చిట్ వేశాడు. 11 నెలల తర్వాత శ్రీనివాసరావు కనిపించకుండా వెళ్లిపోయాడు. చీటి డబ్బులు కాకుండా శ్రీనివాసరావు సురేష్‌కు చేబదులుగా రూ.5 లక్షలు ఇచ్చాడు. సురేష్ వద్ద శ్రీనివాసరావుతో పాటు మరి కొంత మంది చిట్స్ వేయగా, వారికి కూడా డబ్బులు చెల్లించలేదు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సంక్షేమంలో దేశానికి ఆదర్శం

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- నియోజకవర్గ వ్యాప్తంగా భారీగా నూతన పింఛన్ల మంజూరు
- ఆనందోత్సాహాల్లో లబ్ధిదారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సంక్షేమ కార్యక్రమాలకు యావత్ దేశానికి ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 52వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు వెలంపల్లి శ్రీనివాసరావు తన క్యాంపు కార్యాలయంలో బుధవారం అందించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో భారీగా పెన్షన్లు మంజూరు చేశామన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ కార్యక్రమాలను అందించే లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గత పాలకులు పెన్షన్లను మంజూరు చేయటానికి ఎవరైనా మరణిస్తే తప్ప కొత్తవారికి ఇచ్చే పరిస్థితులు ఉండేవి కావన్నారు. కానీ నేడు తమ ప్రభుత్వ పాలనలో ఎవరైతే అర్హులు ఉంటారో వారికి తప్పనిసరిగా పథకాలను అందించే లక్ష్యంతో తాము పని చేస్తున్నామని చెప్పారు. లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు తంగెళ్ల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

53వ డివిజన్‌లో..

కొత్తపేట 53వ డివిజన్‌లో కొత్తగా మంజూరైన పెన్షన్లను స్థానిక కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు అందజేశారు. డివిజన్‌లోని సచివాలయం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో కొత్తగా మంజూరైన పెన్షన్లను సంబంధిత లబ్ధిదారులకు అప్పాజీరావు



లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, నాయకులు

అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ కార్యక్రమాల అమలుపై తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు.

31 మందికి వైఎస్సార్ పెన్షన్ కానుక

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అర్హతే ప్రామాణికంగా డివిజన్‌లో 31 మందికి వైఎస్సార్ పెన్షన్లను నూతనంగా మంజూరు చేశామని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. 48వ డివిజన్ పరిధిలో నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు కార్పొరేటర్ కార్యాలయం వద్ద పెన్షన్లను పంపిణీ చేశారు. పార్టీలకతీతంగా పెన్షన్లు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం ప్రభుత్వ, కార్పొరేటర్ల కార్యాలయాల చుట్టూ తిరిగిన సందర్భాలను లబ్ధిదారులు గుర్తు చేసుకుంటున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇళ్ల వద్దకే పథకాలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, నాయకులు అయితా కిశోర్, బాయన అమర్‌నాథ్, ఆర్.శ్రీను, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్ల మంజూరు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నామని 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ అన్నారు. డివిజన్‌లో 22 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను కార్పొరేటర్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులం, మతం, పార్టీ, వర్గాలకు అతీతంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తోందన్నారు. డివిజన్ బాధ్యులు గోదావరి బాబు, సచివాలయ కన్వీనర్ మద్దిరాల కమలాకరరావు, అడ్మిన్లు గాయత్రి, భాస్కర్, కల్యాణ్, వెల్ఫేర్ సెక్రటరీలు సీహెచ్ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో..

జక్కంపూడి వైఎస్సార్‌కాలనీ సచివాలయాలు 2, 3 పరిధిలో నూతనంగా 120 మంది లబ్ధిదారులకు మంజూరయిన పింఛన్లను స్థానిక ఎంపీటీసీ బయ్యారపు కల్పన అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో లబ్ధిదారు ఎవరైనా చనిపోతే తప్ప వేరేవారికి పింఛన్ ఇచ్చేవారు కాదని, సీఎం జగన్ ప్రభుత్వంలో అర్హత ఆధారంగా పెన్షన్ అందజేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బయ్యారపు రవికిషోర్, రూరల్ మండల కన్వీనర్ రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

45వ డివిజన్‌లో..

విద్యాధరపురం 45వ డివిజన్‌లో కొత్తగా 25 మందికి మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుకను బుధవారం స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య అందజేశారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా సచివాలయాల సెక్రటరీలు, పార్టీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.



53వ డివిజన్‌లో కార్పొరేటర్ అప్పాజీరావు ఆధ్వర్యంలో..



వైఎస్సార్ కాలనీలో..



నూతన పెన్షన్లు పొందిన లబ్ధిదారులతో కార్పొరేటర్ ఆదిలక్ష్మి



కేఎల్ రావునగర్‌లో పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ గోదావరి గంగ, బాబు



45వ డివిజన్ కార్పొరేటర్ మాధురి లావణ్య ఆధ్వర్యంలో..

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరపాలక సంస్థ యూసీడీ విభాగం ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణను బుధవారం ప్రారంభించారు. భవానీపురం 42వ డివిజన్ పరిధిలోని కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పీఓ కె.శకుంతలతో కలిసి కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ శిక్షణ ఆరునెలల పాటు కొనసాగుతుందన్నారు. రోజూ నాలుగు గంటల చొప్పున శిక్షణ ఇస్తారని తెలిపారు. 30 మంది మహిళలు శిక్షణలో పాల్గొంటారన్నారు. సిబ్బంది దుర్గాప్రసాద్, రమ్యకృష్ణ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార దాతలకు సత్కారం



లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో క్షయ రోగులకు టి.బి. ముక్త్ భారత్‌లో భాగంగా నిక్షయ మిత్ర పోర్టల్ ద్వారా స్వచ్ఛందంగా ఆరు నెలల పోషకాహారం అందజేస్తున్న దాతలను సత్కరించారు. అందులో భాగంగా బుధవారం ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్ , డీఎల్ఏటీవో డాక్టర్ జె.ఉషారాణి ఆధ్వర్యంలో దాతలను సత్కరించారు. నిక్షయ మిత్ర కార్యక్రమంలో భాగస్వాములైన హెల్త్ సూపర్‌వైజర్ అనుమోలు వీరభద్రరావు, హెల్త్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, వాసవ్య మహిళా మండలి, అపోలో టైర్స్ హెల్త్ కేర్ వారిని దాతలుగా ప్రోత్సహిస్తూ సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. డీఐఓ డాక్టర్ అమృత, ప్రభుత్వాస్పత్రి డీసీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ యు.శోభ, టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ పద్మావతి, డీపీఎంఓ డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

‘అగ్రిగోల్డ్ చలో విజయవాడ’కు అనుమతి లేదు

డీసీపీ విశాల్‌గున్ని

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నగరంలో 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 నిషేధాజ్ఞలు అమలులో ఉన్నందున అగ్రిగోల్డ్ కస్టమర్స్–ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న నగరంలోని జింఖానాగ్రౌండ్‌లో తలపెట్టిన అగ్రిగోల్డ్ చలో విజయవాడ దీక్షకు ఎటువంటి అనుమతులు లేవని డీసీపీ విశాల్‌గున్ని పేర్కొన్నారు. ఈ మేరకు కమాండ్ కంట్రోల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎవరైతే నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తారో వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమకు అందిన ముందస్తు సమాచారం ప్రకారం కొంతమంది బయటి వ్యక్తులు కూడా ఈ ధర్నాలో పాల్గొని హింసకు పాల్పడే అవకాశం ఉందన్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరగటంతో శాంతి భద్రతల దృష్ట్యా నగరంలో 2 వేల మంది పోలీస్ సిబ్బంది, సీసీ, డ్రోన్ కెమెరాలు, వీడియోగ్రఫీ ద్వారా నిఘా పెట్టి, పటిష్టమైన పోలీస్ బందోబస్త్



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మాట్లాడుతున్న డీసీపీ విశాల్‌గున్ని

ఏర్పాటు చేస్తామన్నారు. నేటి నుంచి విజయవాడ వైపు వచ్చు అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని ఆయన తెలిపారు. సమావేశంలో ఏడీసీపీ రమణమూర్తి పాల్గొన్నారు.

చవితి పందిళ్లకు అనుమతులు తప్పనిసరి..

ఈ నెల 18న జరగనున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నగరంలో పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకునే ఉత్సవ నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తు పోలీసుల అనుమతి పొందాలన్నారు. ఉత్సవ నిర్వాహకులకు సమయం తక్కువ ఉండటంతో మున్సిపల్, పంచాయతీ, ఫైర్ డిపార్ట్‌మెంట్, ఎలక్ట్రిసిటీ, పోలీసు శాఖలు అనుమతుల కోసం ఆయా శాఖల వద్దకు వెళ్లడం కష్టతరంగా ఉంటుందన్నారు. దీంతో పోలీస్ శాఖ అన్ని శాఖల అధికారులతో చర్చించి అన్ని శాఖలు ఒకే ప్రదేశంలో అనుమతులకు అర్జీలను ఇవ్వడానికి, అనుమతులు పొందడానికి ఏర్పాట్లు చేసిందని తెలిపారు. నిర్వాహకులు అనుమతుల కోసం ఎంజీ రోడ్డులోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియానికి ఎదురుగా ఉన్న కమాండ్ కంట్రోల్ నందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమీకృత పోలీస్ సేవా కేంద్రం (యూపీఎస్సీ)లో అన్ని వివరాలతో కూడిన దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఆయా దరఖాస్తులను అధికారులు పూర్తిగా పరిశీలించిన అనంతరం అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఈ నెల 14 నుంచి ప్రతి రోజే ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమీకృత పోలీస్ సేవా కేంద్రం పని చేస్తుందని డీసీపీ తెలిపారు.

హరికథా సంప్రదాయానికి పూర్వవైభవం తీసుకురావాలి

విజయవాడకల్చరల్: హరికథా వైభవానికి పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరముందని శాతవాహనా కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 159 జయంతి సందర్భంగా శిష్య ప్రశిష్య బృందం ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండంలో నిర్వహిస్తున్న జయంతి వేడుకలు, హరికథా ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాసత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మ హరికథ అని ఆదిభట్ల నారాయణదాసులాంటి దాసవరేణ్యులు హరికథను జాతీయ స్థాయికి తీసుకువెళ్లారన్నారు. ప్రతీ ఏటా ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.

ఆత్మీయ సత్కారం

శ్రీ కోట కళాపీఠం కార్యదర్శి కోట శివశాస్త్రి మాట్లాడుతూ హరికథా భాగవతులకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన, జాగర్లమూడి వెంకట కృష్ణయ్య,



మాట్లాడుతున్న రమాసత్యనారాయణ

సుధారాణి, బుర్రా పద్మనాభశాస్త్రి, యనమండ్ర వెంకట కృష్ణయ్య, అమ్ముల ప్రసాద్, తెలుగు సంస్కృత అకాడమీ సభ్యుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్, సినీ నటి కరాటే కల్యాణి హరికథా వైభవం అంశంగా ప్రసంగించారు. హరికథా గానంలో భాగంగా తిరుపతికి చెందిన వై వేంకటేశ్వర్లు గజేంద్రమోక్షం, నెల్లూరుకు చెందిన పరాయితం నారాయణా చార్యులు భక్త పురందర దాసు, రాజమండ్రికి చెందిన పురాణం విజయలక్ష్మి రుక్మిణి కల్యాణం గానం చేశారు. హరికథా భాగవతులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు

- మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి
- పలు డివిజన్లలో విస్తృత పర్యటన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్)/పటమట(విజయవాడతూర్పు): నియోజకవర్గంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వీఎంసీ అధికారులతో కలిసి వీరిరువురూ మంగళవారం నియోజకవర్గంలోని 41వ డివిజన్‌లోని 72 పాకల ఏరియా, 43వ డివిజన్‌లోని ఓల్డ్ హెచ్‌బీ కాలనీ, 44వ డివిజన్‌లోని లేబర్ కాలనీ, 53వ డివిజన్‌లోని నూర్‌ఉల్‌హక్ (డ్రెయిన్) ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. వర్షపు నిలిచిన ప్రాంతాల్లోని ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే నియోజవర్గంలో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లోని ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తెచ్చారన్నారు. ఈ నేపథ్యంలోనే డివిజన్లలోనే పర్యటిస్తున్నామన్నారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ఆదేశాలిచ్చామని చెప్పారు. నియోజకవర్గంలో అన్నీ పాత కాలువలేనని, వాటిలో కొన్నింటిని అభివృద్ధి చేశామన్నారు. మిగిలిన వాటిని వీలైనంత తొందరలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో గణపతిరావు రోడ్డు, కేటీ రోడ్డు ముంపునకు గురి అయ్యేవని, నేడు మా ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో



డ్రెయిన్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, నాయకులు

అభివృద్ధి చేశామన్నారు. నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.

బావ కళ్లలో ఆనందం కోసమే..

భర్త జైలుకు వెళితే భార్య బాధపడడం ఎంత సహజమో.. తప్పు చేసినవారు జైలుకు వెళ్లడం అంతే సహజమని వెలంపల్లి అన్నారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు పాత్ర రుజువైనందువల్లే ఆయన జైలుకు వెళ్లారన్నారు. కోర్టు ఇచ్చిన తీర్పులకు, ప్రభుత్వాలకు ఏం సంబంధమని ప్రశ్నించారు. తన బావ అరెస్ట్ నేపథ్యంలో బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు హేయమన్నారు. బావ కళ్లలో ఆనందం కోసమే బాలయ్య ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించేది లేదన్నారు. ముందుగా బాలకృష్ణ తెలుగుదేశం పార్టీని కాపాడుకోవాలని హితవు పలికారు. చంద్రబాబు అరెస్ట్ అయితే వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు జరుపుకోవద్దని సూచించిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. టీడీపీ బంద్‌కు పిలుపునిస్తే హెరిటేజ్ సంస్థ వ్యాపారులు చేసుకోవడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు అవినీతిపై అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. చంద్రబాబు, లోకేష్‌లు యువకులను మోసం చేస్తే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి యువకులకు మంచి చేశాడన్నారు. టీడీపీకి ప్రజలపై ప్రేమ లేదని చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, మైలవరపు రత్నకుమారి, మహదేవు అప్పాజీరావు, శీరంశెట్టి పూర్ణచంద్రరావు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

క్రాస్ కల్వర్ట్ నిర్మాణ పనులకు శ్రీకారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం అంబేడ్కర్ రోడ్డులోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ వద్ద నిర్మించనున్న క్రాస్ కల్వర్ట్ నిర్మాణ పనులకు 38, 39 డివిజన్ల కార్పొరేటర్లు షేక్ రెహమతున్నీసా, గుడివాడ నరేంద్ర రాఘవ బుధవారం కొబ్బరికాయలు కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక కుమ్మరిపాలెం సెంటర్ నుంచి గుప్తా సెంటర్ వరకు మెరుగైన డ్రెయినేజీ వ్యవస్థ కోసం రూ.10 లక్షల వ్యయంతో క్రాస్ కల్వర్ట్ నిర్మిస్తున్నామన్నారు. అదే విధంగా ఎస్‌బీఐ బ్యాంక్ ముందు నుంచి గుప్తా సెంటర్ వరకు అవుట్‌ఫాల్ డ్రెయిన్ కూడా నిర్మిస్తామని చెప్పారు. చిన్నపాటి వర్షం కురిసినా దుకాణదారులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి క్రాస్ కల్వర్ట్, రోడ్డుకు ఒక వైపు అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మిస్తున్నామని చెప్పారు. దీంతో ఈ ప్రాంతవాసులకు ముంపు బాధలు తొలగిపోనున్నాయని తెలిపారు. కల్వర్ట్ నిర్మాణానికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్, నాయకులు ఏలూరు వెంకన్న, డీవీ రెడ్డి, ఆర్ వెంకట్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు రెహమతున్నీసా, నరేంద్ర రాఘవ తదితరులు

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా మృతురాలి మట్టి ఖర్చులకు రూ.10 వేల నగదును 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ, డివిజన్ బాధ్యుడు గోదావరి బాబు ఆమె కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. డివిజన్‌లోని 147వ వార్డ్ సచివాలయం పరిధిలో నివసిస్తున్న బెవర వెంకటలక్ష్మి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈ క్రమంలో ఆమె అంత్యక్రియల నిమిత్తం వైఎస్సార్ బీమా పథకం కింద ముందస్తుగా గోదావరి గంగ, బాబులు ఈ నగదును మృతురాలి భర్త నారాయణకు అందించారు. కార్పొరేటర్ గోదావరి గంగ మాట్లాడుతూ మిగతా బీమా నగదును త్వరలోనే ఆమె భర్త నారాయణ బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. సచివాలయ కన్వీనర్ కమలాకరరావు, అడ్మిన్ గాయత్రి, వలంటీర్ ఉదయకుమారి పాల్గొన్నారు.

టీటీడీకి 10 టన్నుల కూరగాయలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): తిరుమల నిత్యాన్నదానానికి ప్రతి నెలా కూరగాయలు పంపడం మనకు ఎంతో గర్వకారణమని ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీహరిరావు అన్నారు. ఎ.కన్వెన్షన్ సెంటర్ నుంచి తిరుమలకు ఏలూరుకు చెందిన సంబంగి అప్పారావు, హేమలత దంపతులు, వారి మనమలు జక్కు వినయ్‌తేజ, జక్కు భార్గవ్‌తేజల సహకారంతో 10 టన్నుల కూరగాయలను పంపించారు.

చిరుధాన్యాలపై అవగాహన



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఐసీడీఎస్ సెక్టార్–1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం భవానీపురంలోని నులకపేట–1 అంగన్‌వాడీ కేంద్రంలో, 38వ డివిజన్ పరిధిలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి వచ్చిన తల్లులు, గర్భిణులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా భవానీపురంలోని విజేత హైస్కూల్‌లో చదువుతున్న కిశోర బాలికలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సెక్టార్–1 సూపర్‌వైజర్ జి.ప్రశాంతి మాట్లాడుతూ గర్భం దాల్చిన ప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా చిరుధాన్యాలను వివిధ రూపాల్లో తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కిశోర బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పూర్ణిమ, మైబీ, కాశీరత్నం పాల్గొన్నారు.